క్లుప్తంగా

పారదర్శకంగా సర్వే చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ గోవింద

పూసపాటిరేగ: ఓటర్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ తాడ్డి గోవింద సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలని సూచించారు. ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు, తొలిగింపులపై దృష్టి సారించాలన్నారు. ఎటువంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పక్కాగా సర్వే చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ మూర్తి, డెప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఆర్ఐ మాధురి పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి



గోకపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ అన్నారు. పట్టణంలోని గోకపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి సరఫరా అయిన గుడ్లు, పాలు, చెక్కీలు, కర్జూరం నాణ్యతను పరిశీలించారు. ఉదయం 9 గంటలకల్లా కేంద్రాలను తెరవాల్సిందేనని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సూచించారు.

వైకుంఠ నారాయణస్వామికి పంచామృతాభిషేకం



స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామనారాయణంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠనారాయణ స్వామికి సోమవారం విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి చండీయాగం



అమ్మవారి చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి చండీయాగాన్ని వనంగుడిలో వేదపండితులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి యాగ విశిష్టతను వివరించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను భక్తులకు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు పర్యవేక్షించారు.

రామతీర్థంలో శ్రావణ పౌర్ణమి పూజలు



వెండి మండపం వద్ద సీతారామ చంద్రమూర్తికి పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: శ్రావణ పౌర్ణమి సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వా మి దేవస్థానంలో అర్చకులు సోమవారం ప్ర త్యేక పూజలు చేశారు. వేకువజామున స్వామివారికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం ఆలయంలోని వెండి మంటపం వద్ద సీతారామస్వామి నిత్యకల్యాణ మహోత్సవాన్ని కనులపండువ గా నిర్వహించారు. శ్రీరామచంద్రమూర్తికి నూతన యజ్ఞోపవీతధారణ చేశారు. అనంత రం వైఖానస మూలపురుషుడు విఖనస ఆచార్యుల జయంతి సందర్భంగా పంచామృతాల తో అభిషేకం, అర్చనలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ వై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- పిల్లల జీవితాలను రిస్క్‌లో పెట్టొద్దు
- మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసు
- ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



సీజ్ చేసిన వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ



హాజరైన మైనర్ల తల్లిదండ్రులు, వాహన యజమానులు

విజయనగరం క్రైమ్: మైనర్లకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులు, వాహన యజమానులకు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాధారణంగా మైనర్లు వాహనం నడపడంలో ఉత్సుకతతో వ్యవహరిస్తారని, ఈ క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నట్లు చెప్పారు. పిల్లల చదువులు, వారి భవిష్యత్ కోసం ఆలోచించే తల్లిదండ్రులు వారికి ఖరీదైన మోటారు సైకిళ్లు కొనిచ్చి వారి జీవితాలను రిస్క్‌లోకి నెట్టేస్తున్నారన్నారు. మైనర్లకు వాహనాలను నడపడం వచ్చినా.. వారిలో మానసిక పరిపక్వత, స్థిరత్వం లేకపోవడం, అత్యుత్సాహం, ఆకతాయితనం, అతివేగంగా వాహనాలు నడపడం, రహదారి భద్రత ప్రమాణాలు పాటించకపోవడం, వాహనాలను కంట్రోల్ చేయలేకపోవడం, పరిస్థితులను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం, ప్రమాదాలను అంచనా వేయకపోవడం వంటి కారణాలతో మైనర్లకు లైసెన్స్‌లు మంజూరు చేయడం లేదన్నారు. ఏటా సుమారు 2.5 లక్షల మంది రహదారి ప్రమాదాల్లో మరణిస్తున్నారని, మరో 4 లక్షల మంది క్షతగాత్రులవుతున్నారన్నారు. ప్రతీ తండ్రి తమ బిడ్డకు బండి నడపడం చాలా బాగా వచ్చన్న అపోహలో ఉంటారని, మన పిల్లలు ఎంత సక్రమంగా బండి నడిపినా ఎదురుగా వచ్చే ఇతర వాహనదారుల నిర్లక్ష్యం వల్ల కూడా ప్రమాదాలకు గురికావచ్చనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. వాహనాల డిజైన్‌లో మార్పులు చేయడం, వాటి సైలెన్సర్లను తొలగించి, శబ్ద కాలుష్యానికి పాల్పడడం కూడా నేరమేనని అన్నారు. అదేవిధంగా నెంబర్ ప్లేట్ లేకపోయినా, అర్థం కాని విధంగా నెంబర్ ప్లేట్స్ ఏర్పాటు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు సకాలంలో ఇన్సూరెన్స్ చేయించుకోవడం వలన ప్రమాదాలకు గురైనా బాధితులకు చెల్లించాల్సిన డబ్బులను ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లిస్తుందని, ఒకవేళ మన వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించకపోతే బాధితులకు చెల్లించాల్సిన సొమ్మును కూడా సొంతంగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అందువలన సకాలంలో వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. మైనర్లు వాహనాలను డ్రైవ్ చేస్తూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులపైన, వాహన యజమానులపైన కేసులు నమోదుచేస్తామన్నారు.

నిబంధనలు పాటించని వారిపై జరిమానా..

స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజలను ఇబ్బంది పెట్టడం పోలీసుల అభిమతం కాదని, రహదారి భద్రతలో భాగంగానే స్పెషల్ డ్రైవ్స్ చేపట్టి, నిబంధనలను పాటించని వాహనదారులకు ఈ చలానాలను విధిస్తామన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రత ప్రమాణాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించడం, నిర్ధిష్ట వేగంతోనే వాహనాలు నడపడం వంటి బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 104 వాహనాలను మోటార్ వెహికల్ చట్టం ప్రకారం సీజ్ చేసే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులకు చలానాలను విధించాలని ట్రాఫిక్ ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ సూరినాయుడును ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు లోవరాజు, శంభాన రవి, ఎ.మహేశ్వరరాజు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

భోగాపురం: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మండల పరిషత్ అధికారులు, సిబ్బందితో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలంలోని ప్రధాన సమస్యలపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. ముఖ్యంగా తాగునీరు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ జి.చంద్రకళ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్‌పై ఎంపీడీఓకు ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అప్పయ్యమ్మ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పంద్రాగస్ట్ వేడుకల్లో ప్రోటోకాల్ పాటించలేదని స్థానిక సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ ఎంపీడీఓ ఎం.రాధికకు సోమవారం ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమానికి తనతో పాటు వైస్ సర్పంచ్ గుజ్జు సురేష్‌రెడ్డిని ఆహ్వానించారని, అయితే తాము పాఠశాలకు వెళ్లేసరికే జెండాను ఎగురవేశారన్నారు. గ్రామ ప్రథమ పౌరురాలుగా ఉన్న తనను ఉద్దేశ పూర్వకంగానే అవమానించారని, దళిత సర్పంచ్‌ను కావడంతో అవమానించారని పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండగుంపాంలో 'వృక్షా బంధన్'



చెట్లకు రాఖీ కడుతున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం ఉన్నత పాఠశాలలో 'వృక్షా బంధన్' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులతో కలిసి చెట్లకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వేణుగోపాలరావు మాట్లాడుతూ మానవ మనుగడకు వృక్షాలే కారణమని, వాటిపై ప్రతి ఒక్కరూ ప్రేమను పెంచుకోవాలన్నారు. స్వచ్ఛమైన గాలిని అందిస్తున్న వృక్షాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విజయనగర ఉత్సవాల నిర్వహణపై సమీక్ష



కోటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్, ఎమ్మెల్యే అదితి గజపతి

విజయనగరం టౌన్: విజయనగర ఉత్సవాలను ఈ ఏడాది వైవిధ్యభరితంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అధికారులకు సూచించారు. స్థానిక కోటలో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ అంబేడ్కర్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అక్టోబరులో రెండురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అక్టోబరు 12న విజయదశమి, 15న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ఉన్నందున 13, 14 తేదీల్లో మాత్రమే ఉత్సవాల నిర్వహణకు అవకాశం ఉందన్నారు. అందువలన ఆ రెండు రోజుల్లోనే కార్యక్రమాలు చేపట్టేలా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. గతేడాది నిర్వహించిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే ప్రజలకు వినోదం పంచే మరికొన్ని వైవిధ్యభరితమైన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. విజయనగరం చరిత్రను తెలియజేసేలా లేజర్‌షో, డ్రోన్ షో, హెలికాప్టర్ ద్వారా నగర వీక్షణం, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల నిర్వహణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అదేవిధంగా కోట చుట్టూ ఉన్న ప్రాంతాన్ని సుందరీకరణ చేపట్టాల్సి ఉందన్నారు. గతేడాది మాదిరిగా జాతీయ స్థాయి డ్వాక్రా ఉత్పత్తుల విక్రయాలకు ఎగ్జిబిషన్ నిర్వహణ, ఫ్లవర్ షో, స్థానిక కళలను ప్రోత్సహిస్తూ కళాకారులతో ప్రదర్శనలు చేసేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్ఓ ఎస్‌డీ అనిత, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా పర్యాటక శాఖ అధికారి లక్ష్మీనారాయణ, డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దారు కూర్మనాథరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ ప్రభాకర్

భోగాపురం: భోగాపురం పోలీస్ స్టేషన్ సీఐ(ఎస్‌హెచ్‌ఓ)గా ఎస్‌వీ ప్రభాకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం వీఆర్‌లో ఉన్న ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐ(ఎస్‌హెచ్‌ఓ)గా పనిచేస్తున్న రవికుమార్‌ను విశాఖపట్నం వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

23న హెచ్‌సీఎల్ టెక్ బీ పరీక్ష

విజయనగరం అర్బన్: హెచ్‌సీఎల్ సంస్థ కెరీర్ ప్రోగ్రాంతో పాటు ఉద్యోగాల కల్పనకు 'హెచ్‌సీఎస్ టెక్ బీ' పేరుతో ఈ నెల 23న స్థానిక పీఎస్ఆర్ కాలనీలోని ఏజీఎల్ డిగ్రీ కళాశాలలో టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరాల్లో 75 శాతం మార్కులతో బైబీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులలో ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం ఆర్ఐఓ కార్యాలయంలో గాని, ఫోన్ నంబర్ 9703179119లో సంప్రదించాలని సూచించారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనుల వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న గంట్రేడు సురేష్ అనే వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన గంట్రేడు సురేష్ ఎల్అండ్‌టీ సంస్థలో రెడ్డికంచేరు గేటు వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. సురేష్ విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇదే మండలంలోని చేపలకంచేరు,రామచంద్రపేట, కొంగవానిపాలెం గ్రామాలకు అరజర్ల రాజు, సుగ్గు రమణ, కోరాడ శ్రీనులు రెడ్డికంచేరులో పూటుగా మద్యం సేవించి నిర్మాణంలో ఉన్న విమానాశ్రయ గేటు వద్దకు వచ్చారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన వారిని సెక్యూరిటీ గార్డు సురేష్ అడ్డుకున్నాడు. దీంతో అతని తలపై ఆ యువకులు రాడ్డుతో బలంగా కొట్టారు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన సురేష్‌ను ఎల్అండ్‌టీ సంస్థ సిబ్బంది విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జీఎంఆర్, ఎల్అండ్ సంస్థ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిషేధిత పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

డెంకాడ: గంజాయి, గుట్కా వంటి నిషేధిత పదార్థాలు అమ్మితే చర్యలు కఠినంగా ఉంటాయని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు హెచ్చరించారు. చింతలవలస గ్రామంతో పాటు ఎంవీజీఆర్ కళాశాల ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాలతో పాటు పలువురి వద్ద ఉన్న బ్యాగ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజలకు అవగాహన కల్పించారు.

మహిళలపై వేధింపులు నిరోధించాలి



కోట వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద సోమవారం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గర్ల్స్ కన్వీనర్ సమీరా మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులకు రక్షాబంధన్ ప్రాముఖ్యతను తెలియజేసేందుకు, ప్రతీ విద్యార్థిని సోదరి భావంతో చూసేలా విద్యార్థుల్లో దృక్పతాన్ని కల్పించేందుకు ఏటా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై ఏవిధంగా అవగాహన కల్పిస్తారో, అదేవిధంగా మహిళలతో ఎలా ప్రవర్తించాలో ప్రతీ తల్లి తమ కొడుక్కి నేర్పించాలని కోరారు. కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కళాశాలలో అత్యాచారం, హత్యకు గురైన ట్రైనీ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు అమలు చేయాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు ప్రజలకు, మీడియా ప్రతినిధులకు, పోలీసులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో సోమేశ్‌రాజు, గుణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సునీల్

భోగాపురం: మండలంలోని సుందరపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో సూపరింటిండెంట్ వెంకటేష్ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ వ్యాప్తికి కారణాలు, నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సునీల్ వివరించారు. ఏఆర్‌టీ చికిత్సపై ఆస్పత్రికి వచ్చే రోగులకు అవగాహన కల్పించారు. మీకు తెలుసా అనే కాన్సెప్ట్ గురించి అందరూ తెలుసుకోవాలని, హెచ్ఐవీ కౌన్సెలింగ్, నిర్ధారణ పరీక్షలు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయడం జరుగుతందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఐవీ కౌన్సెలర్ పుష్పారావు, లేబ్ టెక్నీషియన్ రామకృష్ణ, ఓఆర్‌డబ్ల్యూ వెంకటరమణ, ఏఎన్ఎం స్వాతి, రఘు, అప్పలనాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి



ఒమ్మిపేటలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ నిర్మల

డెంకాడ: ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులందరూ ఈ-పంటలో వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.నిర్మల అన్నారు. మండలంలోని పినతాడివాడ పంచాయతీ ఒమ్మిపేట గ్రామంలో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. సొంత భూముల్లో సాగు చేస్తున్న రైతులతో పాటు కౌలు రైతులు కూడా తాము సాగుచేస్తున్న పంటలను ఈ-పంటలో నమోదు చేయంచుకోవాలని సూచించారు. వివరాలు నమోదు చేసుకోకపోతే పంట నష్టపరిహారం, పంటల బీమా, రైతు సేవా కేంద్రం ద్వారా వచ్చే పథకాలకు అర్హత కోల్పోతారని వివరించారు. పంట నమోదు కోసం అడంగల్, ఆధార్, బ్యాంకు బుక్ జిరాక్స్‌లతో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 31 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 31 ఫిర్యాదులు అందాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి ఫిర్యాదుల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్ఐ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి కృష్ణాష్టమి వేడుకలు



మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఉత్సవ నిర్వహకులు

విజయనగరం టౌన్: ఈ నెల 26 నుంచి 30 వరకు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్యాశీస్సులతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును కలిసి ఆహ్వానం అందించారు. గురజాడ కళాభారతి గ్రౌండ్‌లో అంగరంగ వైభవంగా వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాంలో కూడా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు సీవీఎస్ నాయుడు, ప్రసాద్, ఆదినారాయణ, శ్రీను, సూరిబాబు, ఉపేంద్ర, అప్పలనాయుడు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.